క్లుప్తంగా

ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేసే పట్టభద్రుల శాసన మండలి అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం ఆయన స్థానిక ఎర్రబురుజులో ఎన్నికలప్రచారం నిర్వహించారు.

మహిళలకు సీఎం అండ

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర నాయకులు తెర్నెకల్ సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సీతరాం నగర్‌లోని ఆయన కార్యాలయంలో మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేశారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు సిటీ: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డా.చామల అనిల్ వెంకట ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం కర్నూలు నగరంలో సభ్య సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆ తరువాత ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీఎం దాస్ ప్రసంగించారు. సీపీఎస్ రద్దు కోసం నిక్కచ్చిగా పోరాటం చేస్తున్న ఏపీటీఎఫ్(1938)సంఘం బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళా హక్కులను పోరాడి సాధించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కర్నూలు: మహిళా హక్కులను పోరాడి సాధించుకోవాలని జేవీవీ వ్యవస్థాపకులు బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. జనవిజ్ఞాన వేదిక మహిళా విభాగం ఆధ్వర్యంలో సమత రాష్ట్ర నాయకురాలు సుజాత అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం స్థానిక కేవీఆర్ కాలేజీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆడపిల్లలు ధైర్యంగా జీవించాలని ఉదాహరణలతో వివరిస్తూ ముఖ్యంగా స్త్రీలు మూఢ నమ్మకాలను వీడాలన్నారు. జేవీవీ జాతీయ నాయకులు మహమ్మద్ మియా పాట, మాటతో సందేశం అందించారు. జేవీవీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దామోదర్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి విజేతలైన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. సమత సభ్యులు నిర్వహించిన కార్యక్రమాల్లో గెలుపొందిన మహిళలకు రాష్ట్ర నాయకులు శేషాద్రి రెడ్డి, మున్నూర్ బాషా బహుమతులు అందజేశారు. జేవీవీ రాష్ట్ర నాయకులు యోహాన్ మ్యాజిక్ ప్రదర్శించారు. కార్యక్రమంలో జేవీవీ మహిళా విభాగం జిల్లా నాయకులు హరిత, తేజోమయి, శివనాగిరెడ్డి, చెన్నకేశవరెడ్డి, రామలక్ష్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

కల్లూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని నగర డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక సూచించారు. బుధవారం మండలంలోని పెద్దపాడు యూనిట్‌లో నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. యుఎన్‌ఓ ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో నేల సంరక్షణతో పాటు అందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం పెద్దపాడు రైతులు మహేశ్వర్ రెడ్డి పీఎమ్‌డీఎస్ కిట్లు అందించారు. పొలంలో నవధాన్యాలు సాగు చేయడం వల్ల కలిగే ఉపయోగాలను ప్రకృతి వ్యవసాయ అధికారులు వివరించారు. సచివాలయ సిబ్బంది, ఆదర్శ రైతులు, పెద్దపాడు, కె.మార్కాపురం ప్రకృతి వ్యవసాయ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్: పఠాన్, బలగం, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, ఇన్‌కార్, తూ జూఠీ మై మక్కర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్: సార్, బలగం, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: సర్, బలగం, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్: యాంట్ మ్యాన్ అండ్ ది వ్యాస్ప్ క్వాంటమేనియా, తూ జూఠీ మై మక్కర్, క్రీడ్-3
భరత్ కాంప్లెక్స్: బిగ్ స్నేక్ కింగ్, వాల్తేర్ వీరయ్య
రాజ్: గ్యాంగ్ లీడర్
శ్రీరామ: గ్రంథాలయం
విజయ: వినరో భాగ్యము విష్ణు కథ



హోలీ వేడుకల్లో పాల్గొన్న వాసవీ మహిళా మండలి సభ్యులు



ఉత్సాహంగా నృత్యాలు చేస్తున్న రచయిత్రులు



జిల్లా గ్రంథాలయంలో మహిళలను సన్మానిస్తున్న సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్

సృష్టికి మూలం.. శక్తికి రూపం

- ఘనంగా మహిళా దినోత్సవం
- ఆటపాటలతో సందడి చేసిన అతివలు



సీహెచ్ శిరోమణిని సత్కరిస్తున్న డీసీఎంఎస్ సిబ్బంది





సావిత్రీ బాయి పూలే, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న అతిథులు, రచయిత్రులు. కేక్ కట్ చేస్తున్న ఎస్‌బీఐ డీజీఎం లేఖామీనన్

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... మహిళలే సృష్టికి మూలమని, వారు లేక పోతే జననం లేదన్నారు. అతివలు అనంత శక్తికి ప్రతి రూపాలని, అవకాశాలు వస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు.ఇందులో భాగంగా స్థానిక మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగుతోటలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కర్నూలు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ బి.టి.అనురాధ, ప్రధాన మంత్రి మోదీచే ప్రశంసలు అందుకున్న కోవెలకుంట్ల తాటిచెర్ల విజయదుర్గ లు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.సావిత్రీ బా యి పూలే, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. సమాజ చైతన్య దీపికలు మహిళా మణులన్నారు. విజయదుర్గ మాట్లాడుతూ ప్రధాని నోట తన పేరు, తాను రాసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గేయం వినబడటం తనకు లభించిన గొప్ప గౌరవమన్నారు.నరసం అధ్యక్షులు కావెం. సుబ్బులక్ష్మమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ దండబోయిన పార్వతీ దేవి, సాహితీ సదస్సు అధ్యక్ష కార్యదర్శులు కురాడి చంద్రశేఖర కల్కూర, జేఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు.రచయిత్రులు, కవయిత్రులు నృత్యాలు చేస్తూ ఆడుతూ పాడుతూ సంతోషంగా గడిపారు.

- నగర శివారులోని గాయత్రీ గోశాలలో వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో హోలీ, మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. మహిళలు ఒకరి కొకరు రంగులు పూసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు ఇల్లూరు రాజ్య లక్ష్మి, మండలి కార్యదర్శి బైసాని పద్మజ, కోశాధికారి టీజీ ఉమా, మండలి సభ్యులు పాల్గొన్నారు.
- అవోపా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌ఐ ఎస్.లక్ష్మీదేవి వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణిస్తున్నారన్నారు. ఇంద్రజాలికుడు సీకే డీజే బాబు తన ఇంద్రజాలంతో అలరించారు. అవోపా అధ్యక్షులు గోనూరు యుగంధర్‌శెట్టి, కార్యదర్శి పోలేపల్లి శేషయ్య, కోశాధికారి నాగరాజు, చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు, మహిళా విభాగ్ అధ్యక్షురాలు లక్ష్మీ సుజాత తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా గ్రంథాలయ సంస్థలో నిఖిలేస్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వివిధ రంగాల్లో నిపుణులైన మహిళలను గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్, నిఖిలేష్ ఎడ్యుకేషనల్ అకాడమీ అధ్యక్షుడు మద్దిలేటి, మాజీ కార్పొరేటర్ శ్రీరాములు ఘనంగా సన్మానించారు.

సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకం

కర్నూలు(అర్బన్): నేటి సమాజంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, మహిళలు లేనిదే సమాజం లేదని జిల్లా కలెక్టర్ సతీమణి స్వర్ణలత అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా కలెక్టర్ సతీమణితో పాటు జూపాడుబంగ్లా, గూడూరు ఎంపీడీఓలు మంజులవాణి, మాధవీలత హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి రోజు మహిళలు ఏదో ఒక రకమైన సమస్యలను ఎదుర్కొంటునే ఉన్నారన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని జీవితంలో అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పరిపాలనాధికారిణులు సౌభాగ్య లక్ష్మి, గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ సతీమణి స్వర్ణలతను సన్మానిస్తున్న జెడ్పీ మహిళా ఉద్యోగినులు



వేడుకల్లో మాట్లాడుతున్న ఆర్‌యూ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్శిటీలో వర్సిటీ సీడీసీ డీన్ ఆచార్య ఎం.ఈ రాణి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు పాల్గొని ప్రసంగించారు. మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదని అన్నారు. వర్సిటీ పాలక మండలి సభ్యురాలు శౌరీలు రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రెక్టార్ డా.సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్చా, తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మాసీ కాలేజీలో జరిగిన వేడుకల్లో ఆదాయపన్ను శాఖ అధికారి ఎం.స్టెల్లా రోస్‌లీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థినులకు ముగ్గులు, వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. మైపర్ కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్, నారాయణ, శ్రీచైతన్య కాలేజీల ప్రిన్సిపాళ్లు హవిల, శోభ తదితరులు పాల్గొన్నారు. సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అలివేలమ్మ, రాష్ట్ర నాయకురాలు పి.నిర్మలమ్మలు, ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. మాధవీనగర్‌లోని నారాయణ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా పాల్గొని ప్రసంగించారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్, ఆర్‌ఐ దుర్గాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి

కర్నూలు(హాస్పిటల్): మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత నివ్వాలని డీపీఎంయూ డాక్టర్ ఉమ చెప్పారు. లైంగిక వేధింపులపై బుధవారం ఉమెన్ కంప్లయింట్‌సెల్ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళాధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమ మాట్లాడుతూ మహిళలు గర్భకోశ ముఖ ద్వార ఇన్‌ఫెక్షన్లు, క్యాన్సర్లు, విటమిన్ లోపం, పోషకాహారలోపాలపై వైద్యపరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ పురుషులకు దీటుగా మహిళలు ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, సుభాషిణి, స్వర్ణగౌరి, భాగ్యలక్ష్మి, లీగల్‌కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.

మహిళా రైతులకు సత్కారం

కర్నూలు(అగ్రికల్చర్): మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని పరదీప్ పాస్ఫేటు లిమిటెడ్ ప్రతినిధులు వ్యవసాయంలో అద్భుతంగా రాణిస్తున్న నలుగురు మహిళా రైతులను ఘనంగా సత్కరించారు. పసుపల వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఈవో మురళీధర్ చౌదరి మాట్లాడారు. మహిళా రైతులను మరింత ప్రోత్సహించవలసిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పరదీప్ కంపెనీ రీజినల్ మేనేజర్ గిరీష్, చరణ్‌బసు, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో 55 శాతంపైగా మహిళలకే

కర్నూలు(అగ్రికల్చర్): మహిళలకు గౌరవం ఇస్తున్న ముఖ్యమంత్రుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే మొదటి స్థానంలో ఉంటారని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి తెలిపారు. బుధవారం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయం మహిళ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. బిజినెస్ మేనేజర్ రాజేష్, సిబ్బంది చైర్‌పర్సన్‌ను సత్కరించారు. కొత్తగా పదవి చేపట్టిన శిరోమణి అద్భుతంగా రాణిస్తున్నారని, డీసీఎంఎస్‌ను లాభాల బాట పట్టించడానికి ఆమె చేస్తున్న కృషి ఎనలేనిదని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా నామినేటెడ్ పదవుల్లో 55 శాతంపైగా మహిళలకే కేటాయించడం చరిత్రలో నిలిచిపోయే విషయమని తెలిపారు. మహిళల సంక్షేమానికి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.

సమాజంలో సగభాగం మహిళలు



కోలాటం ఆడుతున్న మహిళలు

కర్నూలు(అర్బన్): సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ జ్యోతిర్మయి అన్నారు. బుధవారం రాత్రి స్థానిక టీజీవి కళాక్షేత్రంలో రాయలసీమ మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానంగా మహిళల ఆటపాటలు, పొడుపు కథలు, కోలాటం, చెక్క భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ నేపథ్యంలోనే వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలను సత్కరించారు. సన్మానం అందుకున్న వారిలో స్వర్ణలత, శశికళ, బాశెట్టి లత, జయలక్ష్మీ, భాగ్యలక్ష్మి పసుపులేటి నీలిమ, విజయలక్ష్మి, సాయిముద్రిక,ఉమాదేవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో రాయలసీమ మహిళా సమాఖ్య నాయకురాళ్లు సుజాత, భారతి, సుధ, వసుంధర, బ్రాహ్మణి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి ఎస్‌బీఐ కృషి

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని కర్నూలు డిప్యూటీ జనరల్ మేనేజర్ లేఖా మీనన్ తెలిపారు. బుధవారం వెంకటరమణ కాలనీలోని ఎస్‌బీఐ బిజినెస్ కార్యాలయంలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. డీజీఎం మాట్లాడుతూ... మహిళల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎస్‌బీఐ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో బిజినెస్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు, నగరంలోని వివిధ బ్రాంచీల మేనేజర్లు, డిప్యూటీ మేనేజర్లు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు(రాజ్‌విహార్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రజా రవాణ శాఖ జిల్లాధికారి వెంకటరామం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషులతో పోటీపడి విద్య, ఉద్యోగ, స్వయం ఉపాధి, రాజకీయ ఎలా ఏ రంగంలోనైనా మెరుస్తున్నారని చెప్పారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్లు, మహిళ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది జ్యోతి పాల్గొన్నారు.

హోలీ సంబరాలు..





కర్నూలు నగరంలోని బిర్లా గేట్ వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మహిళా ప్రజాప్రతినిధులు తదితరులు రంగులు చల్లుకొని సంబరాలు చేసుకున్నారు.

రక్తదానం అభినందనీయం

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థినులు సైతం రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి చెప్పారు. బుధవారం నగర శివారులోని కేవీ సుబ్బారెడ్డి, అశోక ఇంజినీరింగ్ కళాశాలల్లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 90 మంది విద్యార్థినులు, మహిళలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం మాట్లాడుతూ రక్తదానం చేయడంలో యువత ముందుండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధినేత డాక్టర్ కె.వి.సుబ్బారెడ్డి, రెడ్‌క్రాస్ ఈసీ మెంబర్ జి.శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్ర రావు, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ రమేష్ బాబు పాల్గొన్నారు.

నిబంధనల అమలులో ఆదర్శంగా నిలవాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ

కర్నూలు: ట్రాఫిక్ నిబంధనల అమలులో విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలవాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అన్నారు.కల్లూరు మండలం దూపాడు దగ్గర ఉన్న కేవీ సుబ్బారెడ్డి ఫార్మా కాలేజీలో బుధవారం విద్యార్థినులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ట్రాఫిక్ నిబంధనలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. లైసెన్స్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడిన వీడియో చిత్రాలను ప్రొజెక్టర్‌లో ప్రదర్శించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తే విద్యార్థులు పోలీసు కేసుల్లో ఇరుక్కుంటారని తెలిపారు. అలా కేసుల్లో ఇరుక్కున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కూడా రావన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అతివేగంతో వాహనాలు నడపటం ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే వాహనాలు పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలుపుకోవాలని, లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని,..వారు ప్రమాదాలకు కారకులైతే వారి తల్లిదండ్రులు కూడా ముద్దాయిలవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బందితో పాటు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలిలో విజయం మనదే

- ప్రతిపక్షాల ప్రలోభాలు తిప్పి కొట్టాలి
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, చిత్రంలో మేయర్ రామయ్య

కర్నూలు(రాజ్‌విహార్): శాసన మండలి ఎన్నికల్లో విజయం మనదే అవుతుందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఎ హఫీజ్ ఖాన్, మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం రాత్రి స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో పట్టభద్రుల వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డితో కలిసి కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ముందుగా మహిళా నాయకురాళ్లతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే మండలి ఎన్నికలు ముగిసే వరకు విశ్రాంతి లేకుండా శ్రమించాలని, అజాగ్రత్తతో ఉంటే ప్రతి పక్షాలు ప్రలోభాలకు గురి చేసే అవకాశం ఉందన్నారు.ప్రతిపక్షాల ప్రలోభాలను తిప్పికొట్టాలన్నారు. విజయం మనదే.. కానీ భారీ మెజారిటీ కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. పాలన మరింత మెరుగ్గా ఉండాలంటే మండలిలోనూ పూర్తి మెజారిటీ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. కర్నూలు నియోజకవర్గ పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వెన్నపూస రవీంద్రారెడ్డికే వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, రామకృష్ణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ మెంబర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డుల్లో ప్రచారం...

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ కోరారు. బుధవారం ఆయన నగరంలోని 13, 23, 48, 49 వార్డుల్లోని ప్రైవేట్ స్కూల్స్, ఇళ్లకు వెళ్లి శాసనమండలి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుచరితమ్మ, ఏసన్న, సునీల్, బలరాం, కిరణ్, మద్దిలేటి పాల్గొన్నారు.

క్రికెట్ విజేత కేవీ సుబ్బారెడ్డి జట్టు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఏ.క్యాంపులో ఉన్న మైపర్ ఫార్మసీ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం అంతర్ ఫార్మసీ కళాశాలల క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌లో మైపర్ ఫార్మసీ కళాశాల జట్టుపై కేవీ సుబ్బారెడ్డి కళాశాల జట్టు గెలుపొందింది. విన్నర్స్, రన్నర్స్‌కు మైపర్ ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. తద్వారా ఒత్తిడిని అధిగమించి మరింత చురుగ్గా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్ పాల్గొన్నారు.

హరిహర సుతుడా.. అయ్యప్పా



మాట్లాడుతున్న రాజు దేశ్ పాండే, పాల్గొన్న వివిధ జిల్లాలకు చెందిన గాయకులు



ప్రత్యేక అలంకారంలో అయ్యప్పస్వామి

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఫాల్గుణ మాసం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని సప్తగిరినగర్ మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కాషాయ ధ్వజారోహణ, గోపూజ, అభిషేకం, స్వామికి ప్రత్యేక అలంకారం, అఖండ జ్యోతి ప్రజ్వలన, మహా పడి పూజ తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పూజల్లో నగర మేయర్ బీవై రామయ్య పాల్గొన్నారు. హరిహర సుతుడా.. అయ్యప్పా అంటూ స్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో 'నీ గానమే నా ప్రాణం' ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరాయంగా 12 గంటల పాటు అఖండ భజన నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులతో కూడిన భజన బృందాలు అఖండ భజనలో పాల్గొని స్వామి భజన కీర్తనలు ఆలపించి మంత్ర ముగ్దులను చేశారు. అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి అధ్యక్షులు రాజు దేశ్ పాండే, గాయకులు డప్పుశీను, మార్కాపురం శీను, రామలింగారెడ్డి, రంగనాథాచారి, వెంకటరెడ్డి, లక్ష్మణారెడ్డి, కుమార స్వామి, మల్లి, జంగిరెడ్డి, శ్రీనివాసులు, కర్నూలు భజ మండలి వారు ఖభజనలో పాల్గొన్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమితి ప్రచార నిర్వాహకులు హరినారాయణ, రమేష్, ఆలయ కమిటీ జాయింట్ సెక్రటరీ మహేష్, కోశాధికారి రమేష్, జగన్నాథ గుప్త, కే వీ సుబ్బారెడ్డి, దివాకర్‌రెడ్డి, సత్యనారాయణ, నాగన్న, మధుసూదన్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

20న ఉగాది వేడుకలు

కర్నూలు కల్చరల్: విజ్ఞాన సేవా సమితి (వీఎస్ఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని దేవీ ఫంక్షన్ హాల్‌లో ఉగాది మహోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సేవా సమితి కార్యవర్గ సభ్యులు తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు సన్మానం చేయనున్నట్లు పేర్కొన్నారు.